నేనే మురిసిపోతూ సోఫా చూపించాను- ఆచారి మరి కాస్త కుళ్లిపోవటానికని. ఆచారి కంగారులో ఇవేవీ గమనిస్తున్నట్టే లేదు.

'సుబ్బారావ్, ఆపదలో వున్నాను. ఎన్నడూ రానివాణ్ణి నీ సహాయం కోసం వచ్చాను. చేస్తానంటే చెబుతాను.' గుండె కరిగిపోయేటట్టు అన్నాడా మాటలు.

'అయ్యో, పాపం! తప్పకుండా చేస్తాను- నా చేతనైతే.' మాట విడిచేశాను, నా మంచితనాన్ని చూసయినా అతను బుద్ధి మార్చుకుంటాడని.

'అంతమాత్రం మాటన్నావంటే చాలు- చంటివాడికి టైఫాయిడు సంధించింది. వెంటనే ఇంజెక్షన్ యిప్పించకపోతే ప్రాణం నిలిచే ఆశ లేదుట. అయిదు రూపాయలు నీకంత పెద్ద మొత్తం కాదని ఆశపడి వచ్చాను.'

'ఔన్లే ఆచారీ, రూపాయలు కావలసినప్పుడు నేను మంచివాణ్ణి, లేకపోతే చెడ్డవాణ్ణి. అంతే లే; పెడితే పెళ్లి, పెట్టకపోతే శార్థమూనూ.' మొహం వాచేట్టు దులిపేశాను. పాపం, నీరైపోయాడు మానవుడు.

'గతం మరిచిపో బ్రదర్, చచ్చిన పామును చితగ్గొట్టటం నీకు భావ్యం కాదు.' అవే మాటలు మరెవళ్లయినా అంటే కరిగిపోయే వెన్నవంటి నా మనస్సు ఆ నిమిషాన వజ్రం కన్నా గట్టిదైపోయింది.

'నీ మేలు మరిచిపోనోయ్—ఒకరి దగ్గర చెయ్యి జాచి యెరగను. పొరుగువాడివీ, నాలుగు రాళ్లు తెచ్చుకుంటున్న వాడివీ అని నిన్ను యాచించాను.' అతను ప్రాధేయపట్టం చూస్తే మొహం మీద ఉమ్మెయ్య బుద్ధిపుట్టింది.

'నేను ధనం పోగుబోసుకు కూచో లేదు—దానకర్ణుణ్ణని బల్లా కట్టుకో లేదు. నా కేదో నాలుగురాళ్లు వస్తున్నాయి, డబ్బు మురగ వేస్తున్నానని నీకడుపుడుకుగాని- నాకు మటుక్కు ఖర్చులు లేవూ? ఏంవిటో! ఎంతచెట్టు కంత గాలి!!' పర్సు దాచేశాను.

మొహం ముడుచుకుని లేచిపోయాడు చెల్లయాచారి.

# నిజంగా ఆరోజు వస్తే—

చెరుకువాడ శ్రీరామమూర్తి

గంట కొట్టగానే, గబగబలాడుతూ కూలీలంతా పని కట్టేశారు. అంతకు ముందే వెళ్ళిపోయిన అధికారులు ఇంకా ఎక్కడైనా కబుర్లు చెప్పుకొంటూ కాలక్షేపం చేస్తున్నారేమోనని నలువైపులా కనిపించినంత దూరం పారచూచి బయలుదేరాను. ఆదే సమయాన్ని వ్యవసాయ కూలీలు పాటలు పాడుతూ, 'జానపదాల' ఉత్సాహాన్ని వినేవాళ్ళ మనస్సులో కూడా వ్యాపింప జేస్తూ, తొందర తొందరగా పాటలో లయ కలుపుతూ నడిచి పోతున్నారు. "అదేం పువ్వు-చెలోచెలో, పోలో పోలో- కలవ పువ్వు-" పదంలో "చెలోచెలో, పోలోపోలో" చలోక్తి (ఊతపదం!)- పాట చెప్పే పడుచుకు ఎదురుగుండా ఏమి కనిపిస్తే దానిమీదే పాడుతుంది.

నేను పాట వింటూ నడుస్తున్నానే కాని మనస్సులో పలురకాల ఆలోచనలు కదులుతున్నాయి. వాళ్లు ప్రొద్దంతా కష్టించి, కూలి సంపాదించిన ఆనందంతో కష్టాన్నే మరిచిపోయి గూటికి ఎగిరిపోతున్నారు. కానీ నేనలా కాదు- నెలరోజులు పనిచేసి జీతం పుచ్చుకోవాలి! జీత మందుకొని పదిరోజులే అయింది; చేతిలో కానీ కనపడ్డం లేదు. అంతకన్నా ముఖ్యం, రామపాదసాగరం పుణ్యాన్ని దొరికిన వుద్యోగం క్రితం వారంనుంచి ప్రోజెక్టు కట్టే విషయంలో ప్రభుత్వం జరుపుతున్న

చర్చలమీద ఆధారపడి వున్నది. ప్రాజెక్టు దేశాని కెంత లాభమో నాకు వుద్యోగం అంతే. స్వార్థమే అయినా ప్రాజెక్టు కట్టితీరాలి– అనే గాఢమైన కోరిక మనస్సులో నాటుకుపోయింది. ఇలాంటి కోరిక ప్రతి ఆంధ్రుడి మనస్సులోనూ ఉన్నమాట సత్యమే; కాని అంతా ఏక కంఠంతో బైట పెట్టకపోవడమే ఆశ్చర్యం!

ముందు నడుస్తున్న కూలిజనం 'అదే మనిషి- చెలోచెలో, పొలోపోలో- కూలిమనిషి' అని పాడి నవ్వుతున్నారు కానీ నేను వాళ్ళతో నవ్వ లేకపోయాను.

ఇంటికి చేరుకొనేటప్పటికి అక్కడ వేచి వున్న మనిషి నన్ను పలకరించి 'మీరేనా రామ్మూర్తిగారు.' అన్నాడు!

ఔనని ఒప్పుకొన్న తరువాత జేబులో జాగ్రత్తచేసిన సంచి వుత్తరం బైటికి లాగి నా కందించాడు. పై అధికారి బంట్రోతేమో అనుకొన్నాను. కానీ వుత్తరంమీది వ్రాత పరిచయాన్ని జ్ఞాపకం చేసింది. గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నిస్తూనే సంచి చింపి లోపలికాగితం విప్పి చదివాను. సుశీలవ్రాత పదేళ్ళ తరువాత నన్ను ఆశ్చర్యంతో ముంచింది!

వాళ్ళ నాన్నతో సర్క్యూటు వచ్చిందిట. రహదారీ బంగాళాకు వచ్చికలుసుకోమని వ్రాసింది. పదేళ్ళక్రితం స్కూలు జీవితంలో, సుశీలకు నాకు మధ్య విలువల్లో భేదం లేదు. కానీ నేడామె ఒకజిల్లా అధికారి కుమార్తె- నేను కూలీలమీద మేస్త్రీని! ఆ భేదం ఆమె కింకా చేరిన వైనం లేదు! ఏమో? తెలియనిదే నన్ను వచ్చి కలుసుకోమని ఆజ్ఞాపిస్తుందా అనుకొంటూనే వెళ్ళాను.

వరండాలో ఒక్కతే కూర్చుని వున్నది. దారిలో ఎదురైన కారులో ఆమె తండ్రిగారు ఎక్కడికో వెళ్ళారు.

"మూర్తీ...రా..." కూర్చుందుకు కుర్చీ కాళీ చూపింది. బట్లరు తెచ్చిన టీ సిపా చేసింది.

అప్పుడన్న దామె, "చాలా మారిపోయావోయ్" అని.

"జీవితమే మారింది. జీవించడమని ఉద్దేశం! ఇప్పుడు నే నేమిచేస్తున్నానో నీకు తెలుసునా?" అన్నాను.

"తెలియకేం? రామపాదసాగరం కట్టడానికి పరిశోధనలు చేస్తున్నావు!" అన్నది. అల్లరితన మింకా ఆమె కళ్లలో కాంతివంతంగా నాట్యం చేస్తూనేవున్నది.

"అయితే ఫరవాలేదు! ఇన్నాళ్లూ జ్ఞాపకమూ లేక యీ వూరొచ్చాకా?" అన్నాను.

"అదే వెర్రిప్రశ్న! నేను నిన్ను ఇన్నాళ్ళ నుంచీ జ్ఞాపక ముంచుకోవాలనే స్వార్థం నీలో వుండి తీరిందని వెల్లడి చేశావు."

"మానసిక శాస్త్రం ఒప్పగించడానికా నన్ను పిలిపించావు!"

"కాదనుకో - బయటికి పోదాం, పద!" ఇద్దరం బయలుదేరాం! చుట్టుదారిని పరిచయస్థులకు కనిపించకుండా దారి చూప మన్నది.

అరగంట దాటి అయిదు నిమిషాలకు గోదావరి ఇసుకమీద బరువుగా నడుస్తున్నాం.

ప్రాజెక్టు కట్టబోయే తూర్పు పడమటి కొండలు...నది మధ్య నున్న మహానంది కొండ చూపించాను.

"ఎలా వుంటుందోయ్ కట్టాక?" అన్నది.

'ఎలా వుంటుందో వూహించి, ఒక అమెరికను చిత్రకారుడు చిత్రం గీసి చూపించాడు. నిజంగా ఆ రోజు వస్తే?"

"నీ కల నా కెలా అర్థమౌతుందోయ్!" అన్నది నీటి అంచునే నడుస్తూ.

"ఆ చిత్రం (ఫొటో) చూస్తే ఆ కల నీకూ వస్తుంది" అన్నాను.

"వద్దులే! అదేమిటి, అక్కడ క్రేన్ లా వుంది?"

"ఔను! రెం డడుగుల వ్యాసం కలిగిన గొట్టాలు రెండు వందల అడుగుల లోతుకు దింపి ఆ గొట్టం గుండా నీరు శక్తివంతంగా పైకి యంత్రంద్వారా లాగుతారు. అప్పుడు గొట్టం చుట్టూవున్న నీటి ఉపరితలపు ఎత్తు తగ్గి గొయ్యివలె అవుతుంది. దానినుంచి పునాది తవ్వేటప్పుడు నీరు లేకుండా చేయడానికి ఎంత శక్తివంతమైన ఇంజనులు కావాలో తెలుస్తుంది! కానీ యీ ప్రయోగం ఫలవంతం కాలే దంటున్నారు!"

"ఓహో! అదేమిటి, టకటక మని కొడుతున్నది?"

"దాన్నే పైల్ డ్రైవిం గంటారు. ఒకదాని కొకటి అనించి ఇనుప కమ్ములు, గోడవలె, భూమి లోకి దించుతున్నారు. ఇలాంటి గోడనే గుండ్రంగా నిర్మించి చుట్టూవున్న నీరు లోపలికి ఊరకుండా ఆపుతారు. వీటి సాయంతోనే కాఫరు డామ్ నిర్మించుతారు. కానీ యీ కమ్ములు నూరు అడుగుల కన్నా ఎక్కువ లోతు దించడానికి సాధ్యం కావడం లేదు. అందువల్ల మహానందికి తూర్పువైపుగా ప్రవాహం మళ్లించినప్పుడు, ప్రవాహవేగం యీ పైల్సు పక్కనున్న మట్టిని కోసివేయడం వల్ల ప్రమాదం సంభవిస్తుందని అతుర్దా పడుతున్నారు. కానీ ఫరవాలేదని సలహాదారు ఇంజనీర్లు హామీ ఇస్తున్నారు. నామట్టుకు నన్ను చెప్పమంటే, ఏమీ భయంలేదంటాను. ఎందువల్ల నంటే, అసలు నది వేసవి కాలపు ప్రవాహం, మహానందికి తూర్పుగానే వుంటున్నది. రెండవ దేమి టంటే - మహానందికి మూడుమైళ్ళ ఎగువన, నది రెండు పాయలుగా చీలింది. ఆ రెండు పాయలలోను, తూర్పువైపు పాయ లోతు. దాని గుండానే వేసవిలో నది ప్రవహిస్తుంది. మెరకైన పడమటి వైపు పాయ, వరదకాలంలో మాత్రమే వుంటుంది. అయినా యీ పాయ ప్రవాహపు చూపు మహానందికి తూర్పున వున్న పాలేశ్వరస్వామి కొండమీదికి వుంటుంది. అందువల్ల ప్రవాహం మళ్లించినప్పుడు ఇంజనీరులు అనుకొన్న ప్రమాదానికి అసలు తావుండదని నా విశ్వాసం" అని ఆమెకు అర్థమయ్యేలా పాలేశ్వరస్వామి కొండ చూపించాను.

"అయితే, కాఫరు డామ్ ఈ ప్రవాహపు చూపు గుర్తించి కట్టాలని నీ వుద్దేశమన్నమాట!"

"అవును! ఈ ఆలోచన టెక్నికల్‌గా నిలవలేకపోవచ్చును. కానీ కొంతవరకు నిజమే కావచ్చు."

"పై అధికారుల కెందుకు చెప్పకూడదు?"

"విని నవ్వుతా రంతే!"

"ఔను, లోతుపునాదులు రెండు వందల అడుగులకు మించి తీయా లంటున్నారు కదా - ఇనుపకమ్ములు వంద అడుగులు మాత్రమే దించడానికి సాధ్యమైనప్పుడు తక్కిన లోతుకు ఎలా తవ్వడానికి సాధ్యమౌతుంది?"

"అదే చిక్కైన ప్రశ్న! ఈ రెండు వందల అడుగులకు మించి లోతు తవ్వవలసిన భాగం మహానందికి చేరువగా వుంది. నదిని రెండవ వైపు మళ్లించినప్పుడు, నీటి ఒరపిడి ఇక్కడే ఎక్కువగా వుంటుంది. ఇన్నింటికీ- నైసర్గికంగా మహానందికొండ నది మధ్యగా వుండడం వల్ల ప్రాజెక్టు సాధ్యమౌతోంది."

"అది సరే లే, నా ప్రశ్నకు జవాబు చెప్పడం మాని చెప్పిందే చెప్పుతున్నావు!"

"కాని, నీవు అంతా వింటేనేగాని బోధపడదు. నూరు అడుగుల కంటే లోతుగా ఇనుప కమ్ములు దించడానికి సాధ్యం కాదు. ఎందువల్ల నంటే అక్కడినుంచి భూమిలో ఊబి వుండడం వల్ల ఇనుపకమ్ములు నిలువుగా దిగవు! అందువల్ల గొట్టాలగుండా మట్టి కలిపిన బురదనీరు భూమి లోపలికి పంపుతారు. ఈ ద్రవం (బురద నీరు) కొన్ని కెమికల్సు వేయడం వల్ల కొన్ని నిమిషాల తరువాత గడ్డ కడుతుంది. కావలసిన పరిమాణంలో యీ ద్రవాన్ని భూమిలో వదలుతూ గొట్టాన్ని పైకి లాగుతూంటారు. ఈవిధంగా పై వరకూ గడ్డ కట్టిస్తారు."

"అంటే, ఈ ద్రవాన్ని గొట్టాల ద్వారా దగ్గర దగ్గరగా కాఫర్ డామ్ చుట్టూ భూమిలోకి దింపి, గోడవలె గడ్డ కట్టిస్తా రన్న మాట" అన్నది.

"అవును. అలా నూతి గోడవలె గడ్డ కట్టించి బైటినుంచి నీరు లోపలికి వూరకుండా చేసి, పునాది తవ్వడం సులువు చేస్తారు." ఇద్దరం మాట్లాడుకుంటూ బంగాళాకు తిరిగి వచ్చేశాం. ఆరు నెలల క్రిందట అకస్మాత్తుగా నేను అదృష్ట వశాత్తూ ప్రాజెక్టు కంట్రాక్టరు నయాను. తరువాత శాంతి కృష్ణమూర్తి 'తెలుగు స్వతంత్రలో' రామపాదసాగర్ భావి గురించీ, నా భాగ్యం గురించీ కలగన్నాడు. ఆ కల కరిగిపోయిన తరువాత నాకథ వ్రాశాను.